# పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ



పెద్దపల్లి కమాన్ : రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

• కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, డిసెంబర్13: వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించేలా పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ చేపట్టాలని కలెక్టర్ ముజా మ్మిల్ ఖాన్ సూచించారు. ఓటరు జాబితా సవరణ, రూపకల్పనపై సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024 జనవరి ఒకటో తేదీని ప్రామాణికంగా తీసుకొని 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1450 కంటే ఎక్కువ ఓటర్లు ఉండకుండా పునర్ వ్యవస్థీకరణ చేయాలన్నారు. జనవరి 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని చెప్పారు. జనవరి 22 వరకు జాబితాపై అభ్యంతరాలు నూతన ఓటరు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. ఫిబ్రవరి 2లోగా అభ్యంతరాలు, ఓటరు క్లెయిమ్స్‌ను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని సూచించారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. నూతన ఓటరు దరఖాస్తుల స్వీకరణ కోసం పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం, ఆదివారం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నూతన పోలింగ్ కేంద్రం ప్రతిపాదించే పక్షంలో పోలింగ్ కేంద్రానికి రెండు వందల మీటర్ల పరిసరాల్లో ఎక్కడా రాజకీయ పార్టీల కార్యాలయాలు ఉండవద్దని స్పష్టం చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా రూపకల్పన కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అర్హులైన వారందరికీ తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించే విధంగా అన్ని పార్టీలు సహకరించాలన్నారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు శశిభూషణ్, ఉప్పు రాజ్ కుమార్, పొలసాని సంపత్ రావు, ఆర్.శారద, అక్కపాక తిరుపతి, సేపెల్లి రవీందర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**రాఘవాపూర్ కొనుగోలు కేంద్రం తనిఖీ**

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 13 : రాఘవాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో కలెక్టర్ ముచ్చటించారు. , ధాన్యం కొనుగోలు ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు టార్పాన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ధాన్యం నాణ్యతాప్రమాణాలు పాటించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, టార్పాలిన్లు, క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్రక్ షీట్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆదిరెడ్డి, హార్టి కల్చర్ జిల్లా అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, మా ర్కెటింగ్ శాఖ, సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు.

# ప్రతిభా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి, డిసెంబర్13: వివిధ రంగాలలో ప్రతిభ చూపిన క్రైస్తవులు, క్రైస్తవ సంస్థలు ఉత్తమ సేవా/ ప్రతిభ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహ్మద్ మేరాజ్ మహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర క్రైస్తవ (మైనారిటీస్) ఫైనాన్స్ కార్పొరేషన్, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు క్రిస్మస్ -2023 సంబరాల్లో భాగంగా సామాజిక, విద్యా, వైద్య , సాహిత్యం, కళా, క్రీడా, వివిధ రంగాల్లో ఉత్తమ సేవ, ప్రతిభ చూపిన ప్రతిభావంతులైన క్రైస్తవ వ్యక్తులు, సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం సత్కరిస్తుందని తెలిపారు. 30ఏళ్లకు పైబడి ఉత్తమ సేవ/ప్రతిభ కనబరిచిన వ్యక్తులు లేదా, సామాజిక, విద్యా, వైద్య రంగాల్లో ఉత్తమ సేవ/ప్రతిభ కనబరిచిన సంస్థల నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. నామినేషన్ ఫారాలు మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ (మైనారిటీస్) ఫైనాన్స్ కార్పొరేషన్, హైదరాబాద్ నుంచి వ్యక్తిగతంగా గాని లేదా www. tscmfc. in వెబ్ సైట్ నుంచి పొందవచ్చని వివరించారు. పూర్తి చేసిన నామినేషన్లను జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి, పెద్దపల్లి కార్యాలయంలో ఈనెల 15 సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలన్నారు. వివరాలకు 08728-222266 040-23391067 నెంబర్ల నందు సంప్రదించాలని సూచించారు.

# మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

పెద్దపల్లి, డిసెంబర్13: రామగుండం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీకి విడుదల చేసిన మెరిట్ జాబితాపై ఈనెల 15లోగా అభ్యంతరాలను తెలియజేయాలని కరీంనగర్ వారధి సొసైటీ సభ్యుడు, సెక్రటరీ జీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో స్టోర్ కీపర్, స్టెనో టైపిస్ట్, రికార్డ్ క్లర్క్, రికార్డ్ అసిస్టెంట్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ అటెండెంట్స్, డార్క్ రూం అసిస్టెంట్, డిజిటల్ ఇమేజింగ్ టెక్నాలజిస్ట్, రేడియోగ్రఫీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, సిటీ స్కాన్ టెక్నీషియన్, అనస్థీషియా టెక్నీషియన్, ధోబీ, ప్యాకర్స్, ఎలక్ట్రీషియన్ ఫోర్మెన్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఏసీ మెకానిక్, డ్రైవర్, థియేటర్ అసిస్టెంట్, గ్యాస్ ఆపరేటర్, వార్డ్ బాయ్, సబ్ స్టాఫ్ ఉద్యోగ ప్రకటనకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అర్హులు, తిరస్కరించబడిన అభ్యర్థుల జాబితాను రామగుండం ప్రభుత్వ మెడికల్ కళాశాల, జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించామని తెలిపారు. ఏమైనాఅభ్యంతరాలు ఉంటే డాక్యుమెంట్లతో ఈనెల 15న సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని సూచించారు.

## విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 13 : వాసవి క్లబ్ కేసీజీఎఫ్ (పెద్దపల్లి) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం డిక్షనరీలు పంపిణీ చేశారు. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు డిక్షనరీలు అందజేశారు. అల్లెంకి శ్రీనివాస్, కజ్జప్పు భగవాన్, వం గల రవీందర్, ముత్యాల శ్రీధర్, రేణికుంట భాస్కర్, అరుణ, విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బెంచీలు వితరణ

కోల్‌సిటీ, డిసెంబర్ 13: రామగుండం నగర పాలక సంస్థ 25వ డివిజన్ చంద్రశేఖర్ నగర్‌కు చెందిన పైండ్ల శ్రీకాంత్ జ్ఞాపకార్థం అతని స్నేహితులు బెంచీలు వితరణ చేశారు. స్నేహితుడి జ్ఞాపకార్థం సిమెంట్ బెంచీలు వితరణ చేసిన మిత్రులను కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు అభినందించారు. పైండ్ల భిక్షపతి, శ్రీనాథ్, బర్ల సంతోష్, రవికాంత్, రంగు రాయమల్లు, శ్రీకాంత్, శివ, వెంకటేష్, విజ్జి పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్యా యత్నం

రామగిరి, డిసెంబర్ 13: సెంటినరీకాలనీలోని శివరాంనగర్‌లో మాటేటి సురేష్ ఆత్మహత్యకు యత్నించాడు. నాగెపల్లి గ్రామానికి చెందిన సురేశ్ రెగ్జిన్ వర్క్ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. కుటుంబ కలహాల కారణంగా బుధవారం సాయంత్రం ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు హుటాహుటినా పెద్దపల్లి దవాఖానకు తరలించారు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పరామర్శ

గోదావరిఖని, డిసెంబర్ 13: సింగరేణి జీడీకే-2వ గని కార్మికుడు బొడ్డుపల్లి రవి స్థానిక ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా ఐఎఫ్‌టీయూ నాయకులు బుధవారం వెళ్లి పరామర్శించారు. సీఎంవో కిరణ్‌ను కలిసి పరిస్థితి తెలుసుకొని హైదరాబాద్‌కు అంబులెన్సు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో నాయకులు కే విశ్వనాథ్, రామకృష్ణ, చింతల శేఖర్, ప్రసాద్, రాములు, మాతంగి రాయమల్లు, రత్నకుమార్ పాల్గొన్నారు.

# భక్తాంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న అర్చకులు

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 13 : అప్పన్నపేట గ్రామంలో బుధవారం శ్రీ భక్తాంజనేయ స్వామి పునః ప్రతిష్ఠ, శ్రీసీతా లక్ష్మణ హనుమత్ సమేత, కోదండ రామాలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని అర్చకులు, వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

ధర్మారం,డిసెంబర్13: విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం పట్టణ కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం మండల అధ్యక్షుడు తాటికొండ వెంకటేశ్, ధర్మారం సంఘం మాజీ అధ్యక్షుడు పోలోజు రాజమౌళి ఆధ్వర్యంలో స్థానిక విశ్వబ్రాహ్మణులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా పాములపర్తి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా కోటగిరి నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా ఎలువాక బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా పోలోజు వెంకటస్వామి, కోశాధికారిగా సేపెల్లి శ్యాంసుందర్, ప్రచార కార్యదర్శిగా కోటగిరి సంతోష్,ముఖ్య సలహాదారులుగా మేడారం వెంకటస్వామి, పాములపర్తి రాజమౌళి ఎన్నికైనారు. కార్యక్రమంలో తాటికొండ లక్ష్మీరాజం, దొనూరి రాజమౌళి, సాములపర్తి శ్రీనివాస్,పాములపర్తి లక్ష్మణ్, గొల్లపల్లి బాపన్న, గొల్లపల్లి పుల్లన్న, తాటికొండ కోటయ్య, తాటికొండ రవి, ఎలువాక మురళి, తాటికొండ బ్రహ్మం, తాటికొండ దామోదర్, తాటికొండ, వెంకన్న, గోపులపురం శ్రీనివాస్,గోపులపురం రాజేందర్,బండోజు సదానందం, తాటికొండ లక్ష్మణ్, దోనూరి చారి,దోనూరి నర్సింహ చారి, రేవెల్లి శ్రీనివాస్, బోనాల విష్ణువర్దన్, నూతి శ్రీకర్ చారి, తాటికొండ వేణు, కోటగిరి లక్ష్మణ్ తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

## ఐఎఫ్‌టీయూని ఆదరించండి

గోదావరిఖని, డిసెంబర్ 13: సింగరేణి చరిత్రలో రాజీలేని పోరాటాలు నడిపిన చరిత్ర కేవలం విప్లవ సంఘాలకే ఉందని ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ కృష్ణ, రామన్న అన్నారు. జీడీకే-1వ గనిపై జరిగిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఈ దఫా సింగరేణిలో జరుగుతున్న ఎన్నికల్లో మూడు విప్లవ సంఘాలు జట్టు కట్టి ముందుకు వస్తున్నాయన్నారు. సింగరేణి నేడు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పెను ప్రమాదంలో ఉండడానికి కారణం పాలకుల విధానాలు ఒకటైతే మరో కారణం మనం ఎన్నుకున్న బూర్జువా సంఘాల ద్రోహపు పాత్ర ఉందనేని గ్రహించాలన్నారు. అసలే ప్రమాదంలో ఉన్న సింగరేణిని ఈ దొంగ సంఘాలను ఎన్నుకొని మరింత ప్రమాదంలో పడేయకూడదని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, మల్లేశ్, నరేశ్, రత్నకుమార్, రామకృష్ణ, రాయమల్లు, దుర్గన్న, కొముర‌య్య, ప్రసాద్, రాజేశం, శేఖర్ తదితరులున్నారు.

## క్వింటాల్ పత్తి ధర రూ. 6712

పెద్దపల్లి, డిసెంబర్13: పెద్దపల్లి ఏఎంసీలో పత్తి కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. బుధవారం క్వింటాలు పత్తికి గరిష్ఠ ధర రూ. 6712 పలికింది. 354 మంది రైతులు నుంచి 1498 క్వింటాళ్ల పత్తిని వ్యాపారులు కొనుగోలు చేశారు. క్వింటాలుకు కనిష్ఠ ధర రూ. 5811, గరిష్ఠ ధర రూ. 6712, మోడల్ ధర రూ. 6677 లభించిందని ఏఎంసీ చైర్మన్ జడల సురేందర్ వెల్లడించారు.

## రైతులకు అవగాహన

ముత్తారం, డిసెంబర్13: మండలంలోని పోతారంలో బుధవారం కోరమండల్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. మాట్లాడుతు కోరమండల్ సెంటర్‌లో రైతులకు అవసరమయ్యే అన్ని రకాల ఉత్పత్తులు ఉన్నాయని కంపెనీ ప్రతినిధి కే రాహుల్ తెలిపారు. నానో డీఏపీ అందుబాటులో ఉందన్నారు. సమావేశంలో కార్బన్ ప్లస్, 100 లీటర్ల నానో డీఏపీని బుక్ చేసినట్లు తెలిపారు. జడ్పీటీసీ చెల్లల స్వర్ణలత అశోక్, సర్పంచ్ నెత్తెట్ల మహేందర్, ఉప సర్పంచ్ నరేందర్, కంపెనీ ప్రతినిధులు సాగర్, రత్నాకర్ రైతులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ క్యారల్స్ ప్రారంభం

మంథని రూరల్, డిసెంబర్13: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్యారల్స్ కార్యక్రమాన్నిమంథనిలోని సీయోను ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఖాన్ సాయిపేట, ఆరెంద, మల్లారం గ్రామాల్లో క్యారల్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు అబ్బీరా దయారాజ్, పెండ్రి ప్రసన్న కుమార్, గద్దల రాజేశ్, మంథని మార్క్ జోసెఫ్, సంఘ పెద్దలు అంకరి కుమార్, ఎంకే జోసెఫ్, మంథని ప్రసాద్, అందే రమేష్, పోడేటి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రీయింబర్స్‌మెంట్ చేయిస్తాం

గోదావరిఖని, డిసెంబర్ 13: అలవెన్సులపై ఇన్‌కం టాక్స్ తిరిగి రీయింబర్స్‌మెంట్ చేయిస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. జీడీకే-11వ గనిలో ఉదయం ఆరెపల్లి రాజమౌళి అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇన్‌కం టాక్స్ రీయింబర్స్‌మెంట్ గురించి 2011 నుంచి సీఐటీయూ పోరాడుతుందని, కోలిండియాలో అధికారులు కార్మికులు మన సింగరేణిలో అధికారులు కూడా రీయింబర్స్‌మెంట్ తీసుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. అగ్రిమెంట్ జరిగిన నుంచి కార్మికులకు రీయింబర్స్‌మెంట్ చేయాలని పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నా ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. సీఐటీయూ గెలిస్తే తప్పకుండా చేయిస్తామని ప్రతి కార్మికుడికి రూ. 30వేల నుంచి రూ. 60వేల వరకు ప్రతి సంవత్సరం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, గజేంద్ర, ఆరెపల్లి రాజమౌళి, ఆసరి మహేశ్, గౌస్, శ్రీనివాస రావు, మల్లేశ్, రవితేజ, దేవేందర్, సాయికృష్ణ తదితరులున్నారు